సాక్షి
అన్నమయ్య జిల్లా

బుధవారం | 7 | జూన్ | 2023



అమూల్ ప్రయోజనాలపై అవగాహన కల్పించాలి

అమూల్ సంస్థకు పాలుపోస్తే పాడి రైతులకు కలిగే ప్రయోజనాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని జేసీ అన్నారు. -IIలో..



ఘరానా మోసగాడి ఆటకట్టు

ప్లాట్ల పేరుతో నిరుపేదలను మోసం చేసిన ఘరానా మోసగాడిని మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. -IIలో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)



	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.220	రూ.280
రెండోరకం	రూ.140	రూ.210

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1698 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	382	428
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 411.01 కిలోలు

న్యూస్‌రీల్

మారెమ్మతల్లి ఆలయంలో జిల్లా ఎస్పీ ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న ఎస్పీ గంగాధర్‌రావు

సంబేపల్లె : మండల పరిధిలోని పెద్దబిడికి పంచాయతీలో కొలువైన శ్రీ మారెమ్మతల్లిని అన్నమయ్య జిల్లా ఎస్పీ ఆర్. గంగాధర్‌రావు మంగళవారం దర్శించుకున్నారు. జాతర సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు ఎస్పీ ప్రత్యేక పూజలు చేశారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన బందోబస్తుపై ఆయన ఆరా తీశారు.

ముగిసిన జాబ్ డ్రైవ్

రాయచోటి: రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్ డ్రైవ్ కార్యక్రమం ముగిసింది. మంగళవారం కళాశాలలో ఐసీఐసీఐ బ్యాంకింగ్ సంస్థలలో రిలేషన్ షిప్ మేనేజర్ ఉద్యోగానికి జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో జాబ్ డ్రైవ్ నిర్వహించారు. జాబ్ డ్రైవ్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ హర్షలత ప్రారంభించారు. అన్నమయ్య జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 32 మంది అభ్యర్థులు పాల్గొన్నారు. వీరిలో ఐదుగురిని ఎంపిక చేసినట్లు జేకేసీ సమన్వయకర్త టి.వెంకటరమణ తెలిపారు. జేకేసీ మెంటార్ సుధీర్ కుమార్,హెచ్‌ఆర్ కిరణ్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

అర్జీల పరిష్కారంపై అవగాహన పెంచుకోవాలి

రాయచోటి : జగన్ననకు చెబుదాం కార్యక్రమం ద్వారా అందిన అర్జీల పరిష్కారంపై అవగాహన పెంచుకోవాలని వివిధ శాఖల అధికారులకు జిల్లా శిక్షణ ఇన్‌చార్జి అధికారులు శ్రీనివాస్, సంపత్ సూచించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ హాలులో జగనన్నకు చెబుదాం అర్జీలను నాణ్యతగా పరిష్కరించడంపై ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందికి ఒక రోజు శిక్షణ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ బాలకృష్ణ, జీఎస్‌డబ్ల్యుఎస్ అధికారి మనోహర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వైవీయూ బీఈడీ, ఎంఈడీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని బీఈడీ, ఎంఈడీ మూడో సెమిస్టర్ పరీక్షల ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. వీసీ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డితో కలిసి ఫలితాలను విడుదల చేశారు. వీసీ మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్‌లో నిర్వహించిన బీఈడీ పరీక్షలకు 2,342 మంది విద్యార్థులు హాజరుకాగా, 2240 మంది ఉత్తీర్ణులై 95.64 శాతం ఫలితాలు సాధించారన్నారు. అదే విధంగా ఎంఈడీ పరీక్షలు 98 మంది రాస్తే అందులో 80 మంది ఉత్తీర్ణతతో 81.63 శాతం ఫలితాలు సాధించారన్నారు.

ఆర్బీకేలు.. రైతు నేస్తాలు

- దేశానికే ఆదర్శం రైతు భరోసా కేంద్రాలు
- రైతులకు అన్ని రకాల సేవలు అందుబాటులో
- జిల్లాలో 394 ఆర్బీకేలు ఏర్పాటు



గుర్రంకొండ మండలం నడిమిఖండ్రిగలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రం

గుర్రంకొండ: తెలుగుదేశం పాలనలో రైతులన్నా.. రైతుల కష్టాలన్నా ఏమాత్రం పట్టించుకోలేదు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక రైతులకు ఉచిత విద్యుత్ కనెక్షన్ తదితర ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి రైతు బాంధవుడిగా పేరు పొందారు. నేడు తండ్రి బాటలోనే పయనిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతు పక్షపాతిగా కీర్తించబడుతున్నారు.

3.42 లక్షల మంది రైతులకు ప్రయోజనం

అన్నమయ్య జిల్లాలో 394 ఆర్బీకేలు ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు 354 ఆర్బీకేలు నిర్మాణాలను పూర్తి చేసుకొన్నాయి. ఇందుకోసం ప్రభుత్వం రూ.98.50 కోట్లు ఖర్చు చేసింది. జిల్లా మొత్తం 457 మంది వ్యవసాయశాఖ అధికారులు మండల, గ్రామస్థాయిలో రైతులకు సేవలు అందిస్తున్నారు. జిల్లాలోని 3.42 లక్షల మంది రైతులు రైతు భరోసా కేంద్రాల ద్వారా విస్తృత సేవలు పొందుతున్నారు.

ఆర్బీకేల్లోనే రైతులకు అన్ని సేవలు

గతంలో ఏ అవసరం వచ్చినా మండల కేంద్రంలో ఉండే వ్యవసాయశాఖ కార్యాలయానికి రైతులు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం ప్రతి గ్రామంలోనూ ఆర్బీకేలు ఏర్పాటు చేయడం వలన రైతులు తమ సొంత గ్రామాల్లోనే అన్ని రకాల సేవలను పొందుతున్నారు. ముఖ్యంగా రైతుభరోసా పథకం, పీఎం కిసాన్ వంటి పథకాల కోసం ఆర్బీకేల్లో దరఖాస్తు చేసుకొంటున్నారు. పంటల సాగుకు అవసరమైన సలహాలు సూచనలను స్థానిక గ్రామ వ్యవసాయశాఖ అధికారి ద్వారా పొందుతున్నారు.

కియోస్క్ యంత్రంతో ఎన్నో ప్రయోజనాలు

ఆర్బీకేల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్రాల ద్వారా రైతులకు ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. రైతులు ఇక్కడి నుంచి తమకు కావాల్సిన అన్ని రకాల సబ్సిడీ ఎరువులు, విత్తనాలు కావాల్సిన కంపెనీల నుంచి పొందే అవకాశముంది. నేరుగా కియోస్క్ యంత్రాల ద్వారా రైతులు ఆర్థిక లావాదేవీలు జరపవచ్చు. వీటిలో కొనుగోలు చేసిన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు 48 గంటల్లోగా నేరుగా రైతులకే అందే అవకాశముంది. రాష్ట్రంలో తాము పండించే పంటలకు ఎక్కడెక్కడ, ఏయే మార్కెట్లలో ఎంత మేరకు ధరలు ఉన్నాయో తెలుసుకొని తమ పంటలను విక్రయించుకోవచ్చు.

జిల్లా సమాచారం ఇలా..

ఆర్బీకేల సంఖ్య:	394
నిర్మాణాలు పూర్తి చేసుకొన్నవి:	354
మంజూరైన నిధులు:	రూ.98.50 కోట్లు
ఆర్బీకేల్లో పనిచేసే విలేజ్ అగ్రికల్చర్ ఆఫీసర్లు:	457
జిల్లాలో రైతుల సంఖ్య:	3.42 లక్షలు
ఆర్బీకేలు ప్రారంభమైన సంవత్సరం:	2019

భూసార పరీక్షలు

ఆర్బీకేల ద్వారా రైతులకు లభించే మరో గొప్ప అవకాశం భూసార పరీక్షలు. ప్రతి ఏడాది రైతులు తమ పొలంలో భూసార పరీక్షలు చేసుకోవచ్చు. గతంలో భూసార పరీక్షలు గ్రామంలో ఒకరిద్దరికి తప్ప మిగిలిన వారికి తెలిసే అవకాశముండేది కాదు. ప్రస్తుతం ఆర్బీకే వ్యవస్థ వచ్చినప్పటి నుంచి రైతులకు భూసార పరీక్షలు అందుబాటులోకి వచ్చాయి. ప్రతి రైతు భూసార పరీక్ష చేయించుకొని అధిక దిగుబడి సాధించుకుంటున్నాడు.

ఈ క్రాప్ బుకింగ్..పంట నష్టపరిహారం

ఆర్బీకేల ద్వారా ప్రతి రైతు తాము సాగు చేసిన పంటలకు సంబంధించి ఈ క్రాప్ బుకింగ్ (పంట సాగు నమోదు) తప్పనిసరిగా చేసుకుంటున్నాడు. తద్వారా విపత్తులు, తుపాన్ల ద్వారా పంటలు నష్టపోతే ప్రభుత్వం నుంచి పంట నష్టపరిహారం పొందే అవకాశముంది. దీంతో ప్రతి రైతు ఖరీఫ్, రబీ సీజన్లలో తాము చేసిన పంటల వివరాలను వీహెచ్‌ఏలకు తెలియజేస్తే వారు గ్రామాలకు నేరుగా వెళ్లి పంటల నమోదును ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. అనంతరం ఈక్రాప్ బుకింగ్ సర్టిఫికెట్లను సిబ్బంది రైతులకు అందజేస్తున్నారు. ఈ సర్టిఫికెట్ ఆధారంగా బ్యాంకులు రైతులకు పంట రుణాలను అందజేస్తున్నాయి.

సబ్సిడీ ఎరువులు, విత్తనాలు, యంత్రాలు పంపిణీ



ఆర్బీకేల్లో రైతులకు సబ్సిడీ ఎరువులు పంపిణీ చేస్తున్న సిబ్బంది(ఫైల్)

ఆర్బీకేల ద్వారా నిరంతరం సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు పంపిణీ చేస్తున్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనిముట్లతో పాటు ట్రాక్టర్లను కూడా సబ్సిడీపై రైతులకు ఆర్బీకేల ద్వారా పంపిణీ చేస్తున్నారు. సీజన్లతో సంబంధం లేకుండా ఆర్బీకేల్లో సబ్సిడీ ఎరువులు, విత్తనాలు, కొన్ని రకాల పురుగు మందులను నిత్యం అందుబాటులో ఉంచుతున్నారు. గతంలో వీటికోసం రైతులు మండల కేంద్రాలకు వెళ్లి రోజుల కొద్ది క్యూలైన్లలో నిలబడి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉండేది.

నాలుగేళ్లుగా ఎలాంటి కష్టం లేదు



నాలుగేళ్లుగా మాకు వ్యవసాయ సేవలకు సంబంధించి ఎలాంటి కష్టం లేదు. జగనన్న మా గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని నాలుగేళ్ల కింద పెట్టించాడు. అప్పటి నుంచి మాకు ఏం కావాలన్నా అక్కడ దొరుకుతున్నాయి. సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు, పనిముట్లు ఇస్తున్నారు. పంటలు సాగుచేస్తే ఆర్బీకే వాళ్లే వచ్చి పంటలను చూసి ఆన్‌లైన్ ఈ క్రాప్ నమోదు చేస్తున్నారు. పంటలు నష్టపోతే పరిహారం ఇప్పిస్తున్నారు. అన్ని రకాలుగా మేము ఆర్బీకేలతో లాభపడుతున్నాం.

– ఓబుళరెడ్డి, మొరంపల్లె, గుర్రంకొండ మండలం

ఆర్బీకేలపై అవగాహన వచ్చింది



నాలుగేళ్లుగా ఆర్బీకేల ద్వారా అందిస్తున్న సేవలపై రైతులకు అవగాహన వచ్చింది. గ్రామాల్లో రైతులు తమకు ఏం కావాలన్నా ఆర్బీకేలకు వచ్చి అడిగి తీసుకొంటున్నారు. పంటల సాగుకు అవసరమైన సలహాలు, సూచనలను మా సిబ్బంది రైతులకు ఇస్తున్నారు. ముఖ్యంగా కియోస్క్ యంత్రాలతో రైతులకు ఎన్నో ప్రయోజనాలు కలుగుతున్నాయి. వీటిని రైతులు సద్వినియోగం చేసుకుంటున్నారు.

-వాణీశ్రీ, ఏడీఏ, వాల్మీకిపురం

యువత చదువు.. క్రీడలపై సమదృష్టి పెట్టాలి

రాయచోటి : చదువుతో సమానంగా యువత క్రీడలపై కూడా దృష్టి సారించి బాగా రాణించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త, ప్రభుత్వ విప్ గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్ ఆవరణంలో జిల్లా యువజన సర్వీసుల శాఖ, క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో క్రీడాకారులకు క్రీడా పరికరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తోందన్నారు. ప్రతి నియోజకవర్గంలో క్రీడా మైదానాల ఏర్పాటుకు చర్యలు తీసుకుందన్నారు. త్వరలో ఖేలో ఆంధ్ర ప్రోగ్రాం నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సెట్ప్ సీఈఓ సాయిగ్రేస్, క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ షఫీ, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

9వరకు జలశక్తి అభియాన్ కార్యక్రమాల పరిశీలన

జిల్లాలో జలశక్తి అభియాన్ కింద వర్షపు నీటిని ఒడిసి పట్టడంతోపాటు నీటి సంరక్షణ చర్యలను పటిష్టంగా అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ కేంద్ర పరిశీలక బృందానికి వివరించారు. జిల్లాలో అమలవుతున్న జలశక్తి అభియాన్ నీటి సంరక్షణ కార్యక్రమాల పరిశీలనకు మంగళవారం ఇద్దరు కేంద్ర ప్రతినిధుల బృందం అన్నమయ్య జిల్లాకు చేరుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం రాత్రి జిల్లా కలెక్టర్‌తో కేంద్ర ప్రభుత్వ గనులశాఖ ఎండీ ప్రకాష్, అన్నమయ్య జిల్లా జలశక్తి అభియాన్ సెంట్రల్ నోడల్ అధికారి, కేంద్ర ప్రభుత్వ గ్రౌండ్ వాటర్ బోర్డు సైంటిస్ట్ పవార్‌లు సమావేశమయ్యారు. ఇందులో భాగంగా ఈనెల 7 నుంచి 9వరకు వివిధ డివిజన్ల వారీగా అధికారులతో సమావేశం కానున్నారు.

వరద పీడిత గ్రామాల్లో వేగవంతంగా ఇళ్ల నిర్మాణాలు

కలెక్టర్ గిరీషా పీఎస్

రాజంపేట: చెయ్యేరు వరద పీడిత గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలను అన్ని శాఖల సమన్వయంతో వేగవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అన్నారు. మంగళవారం రామచంద్రాపురం, తొగురుపేటలో ఇళ్ల నిర్మాణాల స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులకు కేటాయించిన ఇళ్ల స్థలాల లే అవుట్లలో అన్ని సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సహకారాన్ని అందిపుచ్చుకొని త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలని తొగురుపేట, రామచంద్రాపురం వాసులకు కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట ఇన్‌చార్జి ఆర్డీఓ భాస్కర్, తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి, హౌసింగ్ పీడీ శివయ్య, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈలు కెజెఎస్ చంద్రారెడ్డి, ప్రసన్నకుమార్, వివిధ శాఖ అధికారులు , రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




తొగరుపేటలో ఇళ్ల నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ గిరీషా పీఎస్

గ్రామస్తులతో మమేకమై..

- వరదపీడిత బాధితులకు 10 ఎకరాల్లో 120 మందికి ప్లాట్లు కేటాయించనున్నట్లు కలెక్టర్ వివరించారు. రామచంద్రాపురానికి 40, తొగురుపేటకు 80 ప్లాట్లు ఇస్తున్నట్లు కలెక్టర్‌కు తహసీల్దార్ తెలిపారు. .
- కొండపై భాగంలో కేటాయించిన స్థలం చదును బాగానే ఉందని, దానిని మరికొంతగా అభివృద్ధి చేసి దారి ఏర్పాటు చేయాలని గ్రామస్తుల కోరిక మేరకు కలెక్టర్ అధికారులను ఆదేశించారు.
- రామచంద్రాపురం వాసులు తమకు వేరే ప్రాంతంలో ఇళ్ల స్థలాలను కేటాయించాలని కలెక్టర్‌ను కోరారు.
- తాగునీటి సౌకర్యం కోసం ఓవర్ హెడ్‌ట్యాంకు నిర్మించాలని, స్మశానం చుట్టూ ప్రహరీ నిర్మించి, నీటి వసతి కల్పించాలని , రైతులకు పంట రుణాలు మంజూరు చేయాలని రైతులు కలెక్టర్‌ను కోరారు.
- రైతుల సమస్యలను సావధానంగా ఆలకించిన కలెక్టర్ వాటి పరిష్కారానిక తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

జీవిత సాఫల్య యాత్ర...హజ్

- జిల్లా నుంచి 210 మంది యాత్రకు ఎంపిక
- రాయచోటి, మదనపల్లెలో పూర్తయిన శిక్షణ
- యాత్రికులకు ప్రభుత్వం అండ
- నేడు మొదటి విడత పయనం



మదనపల్లె సిటీ: ఇస్లాంలో హజ్ యాత్ర పరమ పవిత్రమైంది. ఇస్లాం సూచించిన పంచ సూత్రాల్లో చివరిది హజ్ యాత్ర. ఆర్థిక స్థోమత కలిగిన ప్రతి ఒక్క ముస్లిం జీవితకాలంలో ఒక్కసారైనా హజ్‌యాత్రను చేయడం తప్పనిసరి. దీనినే జీవిత సాఫల్య యాత్రగా ముస్లింలు పరిగణిస్తారు. జిల్లాలో ఈ ఏడాది 210 మంది హజ్‌యాత్రకు వెళ్తున్నారు.

- ఇస్లాం హజ్ యాత్ర పుణ్యప్రదమైంది. త్యాగానికి నిర్వచనంగా జరుపుకునే బక్రీదు పండుగ పర్వదినాన సౌదీ అరేబియాలోని పుణ్యస్థలం ముకాద్రమా ప్రదేశంలో కాబాతుల్లా వద్ద హజ్ జరుగుతుంది. యాత్రికులు 40 రోజులు మక్కాతో పాటు ప్రవక్త హజరత్ మహమ్మదుర్ రసూలుల్లా (సాల్లెల్లాహు అలైహి వసల్లం) జన్మస్థలం మదీనాలో గడపాల్సి ఉంటుంది. నమాజులు, తవాఫ్ జికర్, దువా, ఖురాన్ పఠనం వంటి కార్యక్రమాలతో నిత్యం అల్లాను స్మరించుకోవడం, ప్రత్యేక ప్రార్థనలు చేయడమే ఈ యాత్ర ప్రత్యేకత. దైవప్రవక్తలు హజరత్ ఇబ్రహీమ్ ఖలీలుల్లా, హజరత్ ఇస్మాయిల్ జబీవుల్లా త్యాగాలకు ప్రతిరూపంగా ఏర్పడిన హజ్ ముస్లింలకు ఫరజ్ (తప్పనిసరిగా) మారిందని చెప్పవచ్చు.

ప్రత్యేక శిక్షణ

ముస్లింలు అధికంగా ఉన్న జిల్లాలో ఈ ఏడాది హజ్ కమిటీ ద్వారా 210 మంది హజ్‌యాత్రకు వెళ్తున్నారు. అలాగే హజ్ కమిటీ ద్వారా ఎంపిక కాని మరికొందరు ప్రైవేటు ట్రావెల్స్‌లో హజ్‌యాత్రకు వెళ్లనున్నారు. ఈ ఏడాది వీరందరూ విజయవాడ గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో ఈనెల 7న జద్దాకు బయలుదేరి అక్కడి నుంచి పవిత్ర మక్కా, మదీనాకు వెళ్లి హజ్ కార్యక్రమం చేపడతారు. జిల్లా నుంచి హజ్ యాత్రికుల కోసం రాయచోటి, మదనపల్లెలలో శిక్షణ పూర్తి చేశారు. యాత్రకు వెళ్లేవారికి వ్యాక్సిన్ టీకాలు వేశారు.

ఐదు రోజుల ప్రత్యేక ప్రార్థనలు

ముస్లింలు హజ్‌యాత్రలో భాగంగా చివరి అయిదు రోజులు ప్రత్యేక ప్రార్థనలు చేయాలి. ఇస్లామియా కాలమానం ప్రకారం జిల్ హజ్ మాసంలోని 8 నుంచి 12వతేదీ వరకు హజ్‌లో భాగంగా ప్రార్థనలు నిర్వహిస్తారు. జిల్ హజ్ మా సంలోని 8వ రోజున ఎహరాం ధరించి 'మినా' ప్రాంతానికి బయలుదేరుతారు. అక్కడ హజ్ యాత్రికుల కోసం ఏర్పా టు చేసిన గుడారాల్లో నివసిస్తూ నమాజ్‌లు ఆచరిస్తారు. రెండో రోజూ అర్ఫాత్ మైదానానికి వెళ్లి సూర్యాస్తమ యం వరకు ఉండి ప్రార్థనలు చేస్తారు. అక్కడి నుంచి చిన్నచిన్న రాళ్లు తీసుకుని మినాకు వెళ్లాలి. మూడవ రోజున మినా ప్రాంతంలోని సైతాన్‌ను ఏడు స్తార్లు రాళ్లతో కొట్టాలి. ఖుర్బా నీ చేసి శిరోముండనం చేసుకోవాలి. నాలుగు, ఐదో రోజుల్లో మినాలో ఉండి సైతాన్‌పై రాళ్లు విసరాలి. ఇలా ఐదు రోజుల పాటు కార్యక్రమంతో హజ్‌యాత్ర పూర్తవుతుంది .

ప్రత్యేక వస్త్రధారణ 'ఎహరాం'

హజ్‌యాత్రికులు ధరించే ప్రత్యేక దుస్తులను ఎహరాం అంటారు. ఎహరాంలో భాగంగా కుట్టు వేయకుండా ఉన్న రెండు వస్త్రాలు ఉపయోగిస్తారు. నడుము నుంచి కిందకు ఒక వస్త్రం కట్టుకోవాలి. రెండో వస్త్రం ఎడమవైపు నుంచి కుడి భుజంపై వేసుకోవాలి. స్త్రీలు మామూలుగా ధరించే వస్త్రాలతో పాటు తలపై కప్పుకోవడానికి ప్రత్యేక వస్త్రాన్ని ఉపయోగిస్తారు.

ఆరోగ్యప్రదాయిని 'అబ్ –ఎ–జంజం జలం'

హజ్ యాత్రకు వెళ్లే ప్రతి ఒక్క హాజీ అబ్–ఎ–జంజం ప్రత్యేక జలాన్ని తమ వెంట తీసుకువస్తారు. దీనిని ఆరోగ్యప్రదాయినిగా భావిస్తారు. ఈ జలాన్ని ప్రతి ఒక ముస్లిం ఎంతో పవిత్రతతో సేవిస్తారు. మక్కాలోని జంజం పానీ, మదీనాలోని ఖర్జూరపు పండ్లు ప్రసాదంగా భావిస్తారు. అక్కడి నుంచి వచ్చాక వీటినే ప్రసాదంగా అందరికీ పంపిణీ చేస్తారు.

యాత్రికులకు ప్రభుత్వం అండ

పవిత్ర మక్కాకు వెళ్లే యాత్రికులకు రాష్ట్రప్రభుత్వం అండగా నిలుస్తోంది. యాత్ర చేసే వారిపై అదనంగా పడుతున్న భారాన్ని మోయటానికి ప్రభుత్వం ముందుకు వచ్చింది. యాత్రకు ఒక వ్యక్తి వెళ్లి రావాలంటే హైదరాబాదు నుంచి మూడు లక్షల రూపాయల వ్యయం అవుతోంది. విజయవాడ నుంచి రూ.3.80 లక్షలు వెచ్చించాల్సి ఉంటుంది. ఇతర రాష్ట్రాల్లో రూ. నాలుగు లక్షల వరకు ఉంటుంది. ఇలా జిల్లాలో 210 మంది హజ్‌యాత్రకు వెళుతున్నారు. వీరికి ఒక్కొక్కరికి రూ.80 వేలు చొప్పున నిధులు విడుదల చేసేందుకు ఉత్తర్వులు జారీ చేశారు.

నియయ నిబంధనలు పాటించాలి



హజ్‌యాత్రకు వచ్చే యాత్రికులు నియమ నిబంధనలు తప్పక పాటించాలి. వలంటీర్లు చెప్పినట్లు చేయాలి. యాత్రలో ఎంతో నిష్టతో ఉండి అల్లాహ్‌ను స్మరిస్తూ ఉండాలి.

–హాఫీజ్ ఇక్బాల్ అహ్మద్, మదనపల్లె

ప్రతి ముస్లింకు హజ్ తప్పనిసరి



ముస్లింలకు హజ్‌యాత్ర ఎంతో పవిత్రం. ఆర్థిక స్థోమత ఉన్న ప్రతి ఒక్కరూ కచ్చితంగా హజ్‌కు వెళ్లాలి. మక్కా, మదీనా ప్రాంతాల్లో 40 రోజుల పాటు అల్లాహ్ చింతనతో గడపడం మహా ఆనందాన్ని కలిగిస్తుంది. చిన్నతనంలోనే రెండు పర్యాయాలు పవిత్ర హజ్‌యాత్రకు వెళ్లి రావడం అదృష్టంగా భావిస్తున్నా.

–హాజీ పఠాన్ అక్బర్‌ఖాన్, మదనపల్లె.

జగన్ పాలనలో ఆలయాలకు మహర్దశ



శుద్ధిజల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే జి.శ్రీకాంత్‌రెడ్డి, కార్మికశాఖ కార్యదర్శి హరిజవహర్‌లాల్

సంబేపల్లె: ముఖ్యమంత్రి వైఎస్ జగమోహన్‌రెడ్డి పాలనలో ఆలయాలకు మహర్దశ కలిగిందని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, కార్మిక, కర్మాగారాలు, ఇన్సూరెన్స్, వైద్యసేవల శాఖ ప్రభుత్వ కార్యదర్శి హరిజవహర్‌లాల్, అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. మండలంలోని పెద్ద బిడికిలో కొలువైన శ్రీ మారెమ్మ జాతర సందర్భంగా మంగళవారం వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. రూ.26 లక్షలతో చేపట్టిన మారెమ్మ ఆలయ అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. తొలుత గ్రామంలోని శుద్ధిజల కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఉపేంద్రనాథ్ రెడ్డి, పంచాయతీ ఈఓపీఆర్డీ బాలునాయక్, సర్పంచ్ వెంకటరమణ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు : ఒకరి దుర్మరణం


దర్బార్‌బాషా మృతదేహం

రామాపురం : కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిలోని రామాపురం మండల పరిధి గువ్వలచెరువు పార్కింగ్ స్థలంలో మంగళవారం ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో స్కూటరిస్టు దర్బార్‌బాషా (35) దుర్మరణం చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. సుండుపల్లె మండలం రాయవరానికి చెందిన దర్బార్‌బాషా బైక్‌పై గువ్వలచెరువు నుంచి తిరిగివెళ్తుండగా కడప వైపు నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దర్బార్‌బాషా అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు.

కూలి పనికి వెళ్తుండగా..


మృతి చెందిన బయ్యారెడ్డి

బి.కొత్తకోట : బైక్‌పై వెళ్తున్న కూలీని వెనుక వైపున కారు ఢీకొనడంతో దుర్మరణం చెందిన ఘటన మంగళవారం బి.కొత్తకోట సమీపంలోని మల్లెల క్రాస్ వద్ద జరిగింది. హెడ్‌కానిస్టేబుల్ ఎం.రవీంద్రనాయక్ కథనం మేరకు వివరాలు.. పెద్దతిప్పసముద్రం మండలం బూర్లపల్లెకు చెందిన బి.బయ్యారెడ్డి (45) బి.కొత్తకోటలోని వేరుశెనగ మిషన్‌లో కూలీగా పని చేస్తున్నాడు. ఇందులో భాగంగా బయ్యారెడ్డి బైక్‌పై బి.కొత్తకోటకు బయలుదేరాడు. అదే సమయంలో బూర్లపల్లె నుంచి బి.కొత్తకోటకు కారు వస్తోంది. ముందువెళ్తున్న బైక్‌ను వెనుక వస్తున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన బయ్యారెడ్డిని స్థానిక సీహెచ్‌సీకి తరలించి వైద్యం అందించారు. మెరుగైన వైద్యం కోసం మదనపల్లెకు తరలిస్తుండగా మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రవీంద్రనాయక్ తెలిపారు.

బైక్‌లు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

కలికిరి : రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్ర గాయాలపాలైన ఘటన మంగళవారం రాత్రి కలికిరి పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు... మండలంలోని గుట్టపాళెం గ్రామం వాడావాండ్లపల్లి దళితవాడకు చెందిన ప్రసాద్ వ్యక్తిగత పనుల నిమిత్తం స్వగ్రామం నుంచి కలికిరికి వస్తున్నాడు. మార్గంమధ్యలో సామకుంటవారిపల్లి బస్టాప్ సమీపంలో ముందువెళుతున్న మరో ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ప్రసాద్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది గుట్టపాళెం రమణ, చంద్రబాబు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రున్ని కలికిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు క్షతగాత్రుని పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు.

ఘరానా మోసగాడి ఆటకట్టు

- చవక ధరకే ప్లాట్ల పేరుతో 260 మందికి కుచ్చుటోపీ
- వేరొకరి భూమిలోకి అక్రమ ప్రవేశం, ప్లాట్లకు పనులు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కేశప్ప, చిత్రంలో సీఐ శివాంజనేయులు, ఎస్‌ఐ రామమోహన్

బి.కొత్తకోట : ప్లాట్ల పేరుతో నిరుపేదలను మోసం చేసిన ఘరానా మోసగాడి ఆటను పోలీసులు కట్టించారు. పేదలకు తన సొంత భూమి దానం చేసి ఇళ్ల స్థలాలుగా ఇస్తానని నమ్మించి.. వేరొకరి భూమిలోకి అక్రమంగా ప్రవేశించి స్థలాలు చూపిన వ్యక్తిని మంగళవారం అరెస్ట్ చేశారు. దీనికి సంబంధించి డీఎస్పీ కేశప్ప, సీఐ శివాంజనేయులు, ఎస్‌ఐ రామమోహన్ వివరాలు వెల్లడించారు. బి.కొత్తకోటలోని కరెంట్ కాలనీకి చెందిన డేరంగుల పెద్ద ఓబులేశు (65) కొంత కాలంగా స్థిరాస్తి వ్యాపార మధ్యవర్తిగా వ్యవహరిస్తున్నాడు. అయితే ప్లాట్ల పేరుతో పేదలను మోసం చేసేందుకు వేరొకరి భూమిని తనదిగా చెప్పుకొని నమ్మించాడు. దాన విక్రయం ద్వారా రాసిస్తానని చెప్పి, డబ్బు వసూలు చేశాడు. బీరంగిరోడ్డులోని సర్వే నంబర్ 245లో తనకు భూమి ఉందని, అందులో ఇంటి స్థలం ఇస్తానని నమ్మించి ఒక్కొక్కరి నుంచి రూ.3 వేల నుంచి రూ.10 వేలు వసూలు చేశాడు. 260 మందికిపైగా నమ్మి డబ్బు చెల్లించగా వారికి అగ్రిమెంట్లు చేసిచ్చాడు. స్థలాలు చూపుతానని బీరంగి రోడ్డులోని సర్వేనంబర్ 245లోకి వారిని తీసుకెళ్లగా భూమి యజమానులు తహసీల్దార్‌ను ఆశ్రయించారు. ఓబులేశుకు ఆ సర్వేనంబర్‌లో సెంటు భూమి కూడా లేదని తేల్చిచెప్పారు. ఇటీవల సర్వేనంబర్ 243/1లోని 9.27 ఎకరాలు తనదేనని ఓబులేశు పేదలను తీసుకుని భూమిలోకి అక్రమంగా ప్రవేశించి, ప్లాట్లకు సరిహద్దులు నాటే ప్రయత్నం చేశాడు. భూమి యజమానుల్లో ఒకరైన గుండువారిపల్లెకు చెందిన కె.చంద్రశేఖర్ పోలీసులను ఆశ్రయించారు. తమ భూమిలో అక్రమంగా ప్రవేశించి గుంతలు తవ్వి, రాళ్లు నాటి ప్లాట్లు వేస్తున్నారని చేసిన ఫిర్యాదుపై ఎస్‌ఐ రామమోహన్ దర్యాప్తు చేపట్టారు. రెవెన్యూ అధికారుల నుంచి రికార్డులు పరిశీలించాక ఓబులేశుకు పై సర్వేనంబర్లలో భూమిలేదని, పేద ప్రజలను మోసం చేస్తున్నట్టు నిర్ధారణకు వచ్చారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేశాక నిందితుడు ఓబులేశును అరెస్ట్ చేసి మదనపల్లె కోర్టుకు తరలించారు.

నిజం నిర్ధారణ చేసుకోండి

ఎవరైనా భూములు, ప్లాట్లను విక్రయిస్తామని చెబితే జాగ్రత్తగా పరిశీలించాలని పోలీసు అధికారులు కోరారు. సంబంధిత భూముల రికార్డులను తహసీల్దార్ కార్యాలయంలో పరిశీలించాలని వారు చెప్పారు. రికార్డుల మేరకు అంతా కరెక్ట్‌గా ఉంటేనే కొనుగోలు చేయాలని, లేదంటే మోసపోతారని సూచించారు.

బి.కొత్తకోటలో కలకలం

లక్షల విలువైన చోట తక్కువ ధరకే ప్లాట్లు ఇస్తానని నమ్మించిన ఓబులేశును పోలీసులు అరెస్ట్ చేయడంతో డబ్బు చెల్లించిన బాధితుల్లో కలకలం రేగింది. తక్కువ ధరకే ఇస్తానని చెప్పడంతో 260 మందికిపైగా బాధితులు డబ్బు చెల్లించారు. తన భూమి అంటూ ఓబులేశు స్వయంగా బాండు కాగితాలపై అగ్రిమెంట్లు కూడా చేయించి ఇచ్చాడు. ఇప్పుడు తమ పరిస్థితి ఏమిటని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్


నిందితుడి అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ కేశప్ప

మదనపల్లె : తంబళ్లపల్లె మండలంలో సంచలనం సృష్టించిన హత్య కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ కేశప్ప తెలిపారు. తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లె గ్రామం ఎర్రివారిపల్లెకు చెందిన రామిగాని యర్రంరెడ్డి(32) దారుణ హత్యకు సంబంధించిన వివరాలను డీఎస్పీ మంగళవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. కోసువారిపల్లె గ్రామం గుమ్మడికాయలవారిపల్లె, ఎర్రివారిపల్లె పక్కపక్కన గ్రామాలు. గుమ్మడికాయలవారిపల్లెకు చెందిన దేవరపెద్దగారి మధుకర్‌రెడ్డి, ఎర్రివారిపల్లెకు చెందిన రామిగాని యర్రంరెడ్డి స్నేహితులు. వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ, మగ్గం పనులు చేసుకునే వారు. వీరిద్దరికీ ప్రతి రోజు మద్యం తాగే అలవాటు ఉంది. ఇద్దరూ తమ గ్రామాల్లోని ఖాళీ ప్రదేశాలు, పొలాల్లో మద్యం సేవించే వారు. ఈక్రమంలో ఈనెల 3న రామిగాని యర్రంరెడ్డి, దేవరపెద్దగారి మధుకర్‌రెడ్డి మిగిలిన స్నేహితులతో కలిసి మందు తాగాలని నిర్ణయించుకున్నారు. అయితే స్నేహితులు పనులకు వెళుతున్నామని చెప్పడంతో మడికయ్యల వద్ద యర్రంరెడ్డి, మధుకర్‌రెడ్డి ఇద్దరూ కలిసి అతిగా మద్యం సేవించారు. మద్యం మత్తులో ఇద్దరి మధ్య డబ్బుకు సంబంధించి గొడవ జరిగింది. ఒకరిపై ఒకరు దాడి చేసుకునే స్థాయికి వెళ్లింది. పట్టరాని ఆవేశంతో మధుకర్‌రెడ్డి స్నేహితుడైన యర్రంరెడ్డిని పెద్దరాయితో తలకు కుడివైపుగా కణతిపై రెండుసార్లు కొట్టగా, తలకు బలమైన రక్తగాయంతో కిందపడిపోయాడు. చనిపోయాడని భావించిన మధుకర్‌రెడ్డి నేరస్థలం నుంచి పారిపోయాడు. అప్పటికే వీరిద్దరి అరుపులు విన్న గ్రామస్తులు అక్కడికి చేరుకుని అపస్మారక స్థితిలో పడి ఉన్న యర్రంరెడ్డిని 108 అంబులెన్స్‌లో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించగా చికిత్సలు పొందుతూ యర్రంరెడ్డి చనిపోయాడు. దీంతో మృతుడి తల్లిదండ్రులు రాధమ్మ, సుదర్శన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని సీఐ శివాంజనేయులు, ఎస్‌ఐ రామాంజనేయులు విచారణ సాగించారు. దర్యాప్తులో సెల్‌ఫోన్ కాల్‌డేటా, ప్రత్యక్షసాక్షుల వాంగ్మూలం, నేరస్థలంలో వేలిముద్రలు, డాగ్‌స్క్వాడ్, సాంకేతిక ఆధారాలతో మధుకరరెడ్డిని నిందితుడిగా గుర్తించి ముదివేడు క్రాస్‌లో అరెస్ట్ చేశారు. హత్యానేరం కింద కేసు నమోదైనందున నిందితుడు మధుకరరెడ్డిపై రౌడీషీట్ ఓపెన్ చేసి రిమాండ్‌కు పంపుతున్నట్లు డీఎస్పీ తెలిపారు.

పోలీస్ లాంఛనాలతో ఏఎస్‌ఐ అంత్యక్రియలు


ఏఎస్‌ఐ షాజహాన్‌కు అంత్యక్రియలు నిర్వహిస్తున్న పోలీసుల బృందం

రామాపురం : కర్నూలు జిల్లా మద్దికెరలో ఏఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న రామాపురం మండలం నీలకంఠ్రావుపేటకు చెందిన షేక్ షాజహాన్(59) అనారోగ్యంతో మంగళవారం తిరుపతి ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందారు. అంత్యక్రియలు స్వగ్రామంలోని నీలకంఠ్రావుపేటలో సాయంత్రం 5 గంటలకు పోలీసుల లాంఛనాలతో నిర్వహించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె కలరు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా పోలీసుల సంఘం అధ్యక్షులు నాగరాజు, మద్దికెర ఏఎస్‌ఐ ఫణిరాజు, హెడ్‌కానిస్టేబుల్ కుమార్, రామాపురం, రాయచోటి పోలీసులు, నీలకంఠ్రావుపేట ఉప సర్పంచ్ మహబూబ్‌బాష, అయూబ్‌ఖాన్, అన్వర్‌బాష, సిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అమూల్ ప్రయోజనాలపై అవగాహన కల్పించాలి

- జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్
- జగనన్న పాలవెల్లువపై సమీక్ష


మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్, చిత్రంలో ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ

మదనపల్లె : అమూల్ సంస్థకు పాలుపోస్తే పాడి రైతులకు కలిగే ప్రయోజనాలపై రూట్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, మెంటార్లు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ అన్నారు.

మంగళవారం ఏపీ–అమూల్ ప్రాజెక్ట్‌లో భాగంగా మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో జగనన్న పాల వెల్లువ పథకంపై జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్యజిల్లాలోని మదనపల్లె అమూల్ డెయిరీ ప్లాంట్‌కు ప్రతి రోజు పాడి రైతుల నుంచి 46,000 లీటర్ల పాల సేకరణ జరుగుతోందన్నారు. జిల్లాలోని 450 గ్రామాలకు 397 గ్రామాల్లో ఆటోమేటిక్ మిల్క్ కలెక్షన్ యూనిట్స్(ఏఎంసీయూ)లు ఏర్పాటు చేశామని, వాటిలో 330 గ్రామాల నుంచి పాలసేకరణ జరుగుతోందన్నారు. గుర్రంకొండ, పెద్దమండ్యం మండలాల్లోనూ పాలసేకరణ వీలైనంత త్వరగా ప్రారంభించాలన్నారు. రానున్న రోజుల్లో జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పాలసేకరణ చేసేందుకు ప్రభుత్వ శాఖల అధికారులు చొరవ చూపాలన్నారు. పాల సేకరణకు సంబంధించి అమూల్ సిబ్బంది పూర్తి స్థాయిలో దృష్టి పెడితే లక్ష్యసాధన సులభమవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమూల్‌తో కుదుర్చుకున్న ఒప్పందంతో ప్రైవేట్ డెయిరీల దోపిడీకి అడ్డుకట్ట వేయగలిగామన్నారు.

అమూల్ సంస్థ ఏపీలో పాలసేకరణ ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు 11 సార్లు ధరలు పెంచడం జరిగిందన్నారు. ప్రైవేట్ డెయిరీలకు దీటుగా, మరే ఇతర సంస్థలు ఇవ్వని గరిష్టధరను అమూల్ డెయిరీ పాడి రైతులకు ఇస్తోందన్నారు. నాణ్యత కలిగిన పాలను అమూల్ డెయిరీకి పంపడం ద్వారా మంచి ధరను పొందడంతోపాటుగా ఆర్థికంగా వృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, పశుసంవర్ధక శాఖ జేడీ కోటేశ్వరరావు, డెయిరీ మేనేజర్ నవీన్, కో–ఆపరేటివ్ అధికారి ప్రవీణ్‌కుమార్, ఎంపీడీఓలు లీలామాధవి, తాజ్‌మస్రూర్ తదితరులు పాల్గొన్నారు.

కారు టైరు పగిలి.. చెరువులో పడి..


కారును పరిశీలిస్తున్న పోలీసులు


మృతి చెందిన రమేష్

రామాపురం : మండల పరిధిలోని కొండావాండ్లపల్లె సమీపంలో మంగళవారం ముందు టైరు పగలడంతో కారు చెరువులో పడి ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి.

తిరుపతి పట్టణానికి చెందిన ఏపీఎమ్‌ఐఎస్‌ఐ డివిజనల్ ఇంజనీర్ రమేష్ (58) కారులో అన్నమయ్య జిల్లా రామాపురం మండలం హసనాపురం పంచాయతీ పప్పిరెడ్డిగారిపల్లెలోని అమర్‌నాథరెడ్డి ఇంట్లో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరయ్యాడు. తిరిగి కారులో వెళ్తుండగా కొండావాండ్లపల్లె చెరువు కట్ట సమీపంలో టైరు పగిలి కారు బోల్తా పడింది. కారు నడుపుతున్న డి.రమేష్ అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి, క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు.

ప్రశ్నాపత్రం బయటకు.. అదుపులోకి యువకులు


పరీక్షా కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు

చిట్వేలి : పదో తరగతి సప్లమెంటరీ పరీక్షా పత్రం అర్ధగంట తరువాత బయటకు రాగా తక్షణం స్పందించిన అధికారులు యువకులను అదుపులోకి తీసుకొని ప్రశ్నాపత్రాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఈ సంఘటన చోటు చేసుకుంది. పరీక్షా కేంద్రంలోని కిటికీ పక్కన పరీక్ష రాస్తున్న విద్యార్థి పరీక్ష ప్రారంభమైన అర్ధగంట తరువాత ప్రశ్నాపత్రాన్ని బయట ఉన్న యువకులకు అందించాడు. విషయాన్ని గుర్తించిన ఇన్విజిలేటర్.. పై అధికారికి తెలియజేయగా పోలీసులకు సమాచారం అందించారు. వారు తక్షణం స్పందించి యువకులను అదుపులోకి తీసుకొని ప్రశ్నాపత్రాన్ని స్వాధీనం చేసుకొని అధికారులకు అందజేశారు. దీంతో సమస్య సద్దుమణిగింది. ఈ విషయాన్ని జిల్లా విద్యాధికారికి తెలియజేయగా ఆ విద్యార్థి జవాబు పత్రాన్ని ప్రత్యేకంగా పంపాలని అధికారులకు సూచించినట్లు సమాచారం.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ప్రొద్దుటూరు క్రైం : స్థానిక మైదుకూరు రోడ్డులోని అరవేటి థియేటర్ సమీపంలో ఉన్న బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మంగళవారం స్థానికులు సమాచారం అందించడంతో టూ టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడి సంబంధించిన వివరాలు తెలిసిన వారు టూ టౌన్‌పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ రెడ్డిసురేష్ కోరారు.

కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులైజేషన్‌పై హర్షం

రాయచోటి అర్బన్ : కాంట్రాక్టు ప్రభుత్వ ఉద్యోగులను రెగ్యులర్ చేయడానికి మంత్రిమండలి నిర్ణయించడం హర్షణీయమని ఏపీ డీఎస్సీ కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం మధ్యాహ్నం ఆయన విలేకరులతో మాట్లాడారు. అన్ని ప్రభుత్వ శాఖలలో గల కాంట్రాక్టు ఉద్యోగుల అర్హత, సర్వీస్‌లను పరిగణనలోకి తీసుకుని వీలైనంత ఎక్కువ మందిని రెగ్యులర్ చేయాలని కోరారు. 2001, 2002తోపాటు ఇతర డీఎస్సీల ద్వారా విధుల్లోకి తీసుకున్న కాంట్రాక్టు ఉద్యోగులందరినీ వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.

నిరుద్యోగులను నట్టేట ముంచుతున్న పాలకులు


మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ ప్రధాన కార్యదర్శి నక్కి లెనిన్‌బాబు

రాయచోటి అర్బన్ : దేశంలో నిరుద్యోగులను పాలకులు మాయమాటలతో నట్టేట ముంచుతున్నారని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కి లెనిన్‌బాబు అన్నారు. మంగళవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్ జిల్లా స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ దేశం, రాష్ట్రంలో అధికారాన్ని దక్కించుకునేందుకు పాలకులు నిరుద్యోగులకు అనేక వాగ్దానాలు చేయడం, తర్వాత విస్మరించడం తగదన్నారు. దేశంలో అధికారంలోకి రాకముందు ఛాయ్ అమ్మానని చెబుతున్న మోడీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ కార్పొరేట్ సంస్థలకు విక్రయించేస్తుంటే యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు ఎక్కడి నుంచి వస్తాయని ప్రశ్నించారు. ఏటా రెండుకోట్ల ఉద్యోగాలిస్తానంటూ గద్దెనెక్కిన మోడీ సర్కారు 9 సంవత్సరాలువుతున్నా యువతకు ఉద్యోగాలివ్వలేకపోవడం దారుణమన్నారు. దేశంలో యువత సరైన ఉపాధి లేక లోన్, బెట్టింగ్ యాప్‌ల మోజులో పడి తమ జీవితాలను తామే బలి తీసుకుంటున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయన్నారు. యువతను చైతన్యపరచడం ద్వారా వారి హక్కుల కోసం ఏఐవైఎఫ్ నేతలు నిరంతరం పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గంగాసురేష్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు టిఎల్ వెంకటేష్, కార్యదర్శి జక్కల వెంకటేష్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మహేష్, జిల్లా నేతలు సిద్ధిగాళ్ళ శ్రీనివాసులు, రెడ్డిసాయి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జవాబుదారీగా విధులు నిర్వర్తించండి


రికార్డులు తనిఖీ చేస్తున్న జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్

పెద్దతిప్పసముద్రం : సచివాలయాల్లో పని చేసే అన్ని శాఖల అధికారులు సమన్వయంతో, జవాబుదారీగా విధులు నిర్వర్తించాలని అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్ ఆదేశించారు. మంగళవారం ఆయన మండలంలోని తమ్మరకుంట, బూర్లపల్లి గ్రామ సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణ, బయోమెట్రిక్ హాజరు, ఎలాంటి సేవల కోసం ప్రజలు అధికంగా వస్తున్నారని, ఎన్ని రకాల సేవలు అందిస్తున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వేరుశనగ విత్తన కాయల పంపిణీ విధానం, ఎంత మంది రైతులు, ఎన్ని హెక్టార్లలో ఖరీఫ్ సాగు చేస్తారు, ఆర్‌బీకేలో అందుబాటులో ఉన్న ఎరువులపై ఆరా తీశారు. గర్భవతులు, బాలింతల సంఖ్య, వారి ఆరోగ్య సమస్యలతోపాటు నిత్యం అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి ఎప్పటికప్పుడు సమగ్రమైన నివేదిక ఉన్నతాధికారులకు పంపాలని సూచించారు. సచివాలయ సిబ్బంది దినచర్య, వలంటీర్ల పని తీరు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై సమగ్రంగా శాఖల వారీగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్మాణంలో ఉన్న నూతన భవనాలను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీవో గిరిధర్‌రెడ్డి, ఆర్‌ఐ అనీషా తోపాటు పలు శాఖల అధికారులు ఉన్నారు.

రెవెన్యూలో భారీగా బదిలీలు

రాయచోటి : అన్నమయ్య జిల్లా పరిధిలో తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్ల బదిలీలు భారీగా జరిగాయి. ఈ మేరకు మంగళవారం అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. జిల్లాలో 17 మంది తహసీల్దార్లు, 26 మంది డిప్యూటీ తహసీల్దార్లను బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. అలాగే 12 మంది సీనియర్ అసిస్టెంట్లు, ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు ఆఫీస్ సబార్డినేటర్లతోపాటు 46 మంది వీఆర్‌ఓలను బదిలీ చేశారు.

తహసీల్దార్ల బదిలీలు ఇలా..

వి.పుల్లారెడ్డి (ప్రస్తుత స్థానం) చిత్తూరు, ఓబులవారిపల్లి తహశీల్దార్‌గా బదిలీ, ఓబులవారిపల్లి తహసీల్దార్ వెంకట సుబ్బయ్యను రాయచోటి ఆర్డీఓ ఆఫీసులో అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా బదిలీ చేశారు. రాజంపేట ఆర్డీఓ ఆఫీసులో అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా పని చేస్తున్న జే.శిరీషాను చిట్వేలి తహసీల్దార్‌గా, చిట్వేలి తహసీల్దార్‌గా ఉన్న వైఎస్ సత్యానందంను నందలూరు తహసీల్దార్‌గా, నందలూరు తహసీల్దార్ ఎస్.ఉదయ్ కుమార్ రాజును లక్కిరెడ్డిపల్లె తహసీల్దార్‌గా, కలెక్టరేట్‌లో ఎల్‌ఏ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న మహేశ్వరరెడ్డిని వీరబల్లి తహసీల్దార్‌గా, వీరబల్లి తహసీల్దార్ ఏ తులసమ్మను రాజంపేట ఆర్డీఓ కేఆర్‌ఆర్‌సీ తహసీల్దార్‌గా, పీలేరు తహసీల్దార్ జి.రవిని సుండుపల్లె తహసీల్దార్‌గా, రాజంపేట ఆర్డీఓ ఆఫీసులో పని చేస్తున్న జే రామును పెద్దమండెం తహసీల్దార్‌గా, పెద్దమండెం తహసీల్దార్ కె.నిర్మలాదేవిని అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ మెజిస్టీరియల్ వింగ్‌కు, రామాపురం తహసీల్దార్ కె.ఖాజాబీని గుర్రంకొండ, గుర్రంకొండ తహసీల్దార్ డీసీ కృష్ణమోహన్‌ను అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ ఎలక్షన్ వింగ్‌కు, చిత్తూరు తహసీల్దార్ ఎస్.రఫీక్ అహ్మద్‌ను బి కొత్తకోట తహసీల్దార్‌గా, సుండుపల్లె తహసీల్దార్ షేక్ మహబూబ్ చాంద్‌ను మదనపల్లెకు, బి.కొత్తపేట తహసీల్దార్ ధనుంజయులను పీలేరు తహసీల్దార్‌గా, మదనపల్లి తహసీల్దార్ సికే శ్రీనివాసులను కంబాలపల్లె తహసీల్దార్‌గా బదిలీ చేశారు.

డిప్యూటీ తహసీల్దార్ల స్థాన చలనం ఇలా..

చిత్తూరుకు చెందిన పి.కుమార్‌ను పీలేరు డిప్యూటీ తహసీల్దార్(డీటీ)గా, ఆర్ జయసింహను డీసీఎస్‌ఓ అన్నమయ్య కలెక్టరేట్ కార్యాలయానికి, పద్మనాభంను మదనపల్లి ఎలక్షన్ డీటీగా, ఏ గురుప్రసాద్ మదనపల్లి ఆర్డీఓ ఆఫీసు ఎలక్షన్ డీటీగా, బి.కిరణ్ కుమార్ కేవీపల్లి డీటీ, ఎస్ సుబ్రమణ్యంను పీలేరు అదనపు డీటీ, జి ఇషాక్‌ను తంబళ్లపల్లి డీటీగా, టీ లావణ్యను కలికిరి అదనపు డీటీగా, సయ్యద్ అహ్మద్‌ను కలికిరి డీటీగా, ఎస్ఎం అన్సారీని బి కొత్తకోట డీటీగా, డి హరికుమార్‌ను ములకల చెరువు డీటీగా, కె.ప్రదీప్‌ను కలకడ డీటీగా, వై ఫయాజుల్లాను కేవీపల్లి డీటీగా, ఎస్ఎం అజారుద్దీన్‌ను అన్నమయ్య జిల్లా కలెక్టరేట్, ఎస్ వెంకటేశ్వర్లు తంబళ్లపల్లి అదనపు డీటీగా, జి శ్రీనివాసరావును రామసముద్రం డీటీగా, ఎస్‌ముర్షావల్లినీ అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయానికి, ఎం.సుజాతను రాజంపేట ఎలక్షన్ డీటీగా, పోలా భాస్కర్‌ను పౌరసరఫరాల సంస్థ డీటీగా, ఏ శివప్రసాద్‌ను సివిల్ సప్లై డీటీగా, అన్నమయ్య జిల్లా కలెక్టరేట్, జి.సురేంద్రారెడ్డి సుండుపల్లె డీటీ, వి శ్రీధర్ రెడ్డిని చిన్నమండెం డీటీగా, పి లవణకుమార్‌ను రాజంపేట అదనపు డీటీగా, పి మురళీకృష్ణను రాజంపేట ఆర్డీఓ ఆఫీసుకు, కె నరసింహులు రాజంపేట ఎస్‌పీ యూనిట్–4 డీటీ, జి వెంకటరామయ్యను పెనగలూరు డీటీగా బదిలీ చేశారు. ఈ ఉత్తర్వులు త్వరలో అమలు కానున్నాయని అన్నమయ్య జిల్లా కలెక్టర్ ఏఓ బాలకృష్ణ నాయుడు తెలిపారు.